ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
3
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శనివారం 17 ఆగస్టు 2024

వరాల తల్లీ కరుణించమ్మా..

- జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మీవ్రతం
- ఇళ్లలో అమ్మవారికి ప్రత్యేక పూజలు



హిందూపురం డీబీ కాలనీలో అష్టలక్ష్మీమాతకు బంగారు నాణేల అలంకరణ



గోరంట్ల మండలం కొండాపురంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

పుట్టపర్తి, ఆగస్టు 16: వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా చేసుకున్నారు. అమ్మవారి ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లలో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. పండ్లు, పూలు, నైవేద్యాలు సమర్పించుకున్నారు. ముత్తైదువులకు వాయినాలు అందజేసి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. కొందరు మహిళలు ఇళ్లలో వేదపండితులతో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

పేదల కడుపు సల్లగా..

పురంలో తెరుచుకున్న అన్న క్యాంటీన్లు

- ప్రారంభించిన ఎమ్మెల్యే బాలకృష్ణ
- నిరుపేదలకు కడుపునిండా భోజనం
- మొదటిరోజు క్యూకట్టిన జనం
- కూలీలు, చిరువ్యాపారుల హర్షం

హిందూపురం, ఆగస్టు 16: పేదల ఆకలి బాధలు తీరాయి. అన్న క్యాంటీన్లు తెరుచుకున్నాయి. కడుపునిండా భోజనం పెట్టాయి. పట్టణంలో రెండు అన్న క్యాంటీన్లను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వయంగా భోజనం వడ్డించారు. పేదలు, కూలీలు కడుపు నిండా అన్నంతిని, హర్షం వ్యక్తం చేశారు.



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న జనం



చిన్న మార్కెట్‌లో తెరుచుకున్న అన్న క్యాంటీన్



ఆరుబయట భోజనం చేస్తున్న చిన్నారి, మహిళ

గత తెలుగుదేశం హయాంలోనే అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి, రూ.5కే పేదలకు కడుపునిండా భోజనం పెట్టారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్లను మూసేసి, పేదల కడుపుకొట్టారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పాటవడంతో చంద్రబాబు మరోసారి పేదలకు కడుపునిండా భోజనం పెట్టాలన్న సంకల్పంతో స్వాతంత్ర్య దినోత్సవం రోజున అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించారు. ఇందులో భాగంగా హిందూపురంలో రెండు అన్న క్యాంటీన్లను స్థానిక శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నాటికి వందకేంద్రాల్లో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. హిందూపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణం, చిన్నమార్కెట్‌లో పునఃప్రారంభించారు. ఈ రెండుచోట్ల ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం అందించనున్నారు. ప్రస్తుతం బయట హోటల్‌లో భోజనం చేయాలంటే అల్పాహారానికే రూ.50నుంచి రూ.100 వెచ్చించాలి. భోజనం అంటే రూ.100 నుంచి రూ.200దాకా చెల్లించాల్సిందే. అయినా హోటళ్లలో నాణ్యత, శుభ్రత ప్రశ్నార్థకమే. అన్న క్యాంటీన్లలో పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో పేదలు భోజనం చేయాలన్న సంకల్పంతో అన్ని హంగులు కల్పించారు. ఒక్కో అన్న క్యాంటీన్‌లో ఉదయం అల్పాహారం 500 మందికి, మధ్యాహ్నం భోజనం 500 మందికి, సాయంత్రం అల్పాహారం 300 మందికి అందించనున్నారు.

నెలకు రూ.450తో కడుపునిండా భోజనం

ప్రస్తుత పరిస్థితుల్లో ఒక రోజు అల్పాహారం, భోజనం, సాయంత్రం అల్పాహారం తీసుకోవాలంటే కనీసం రూ.250 ఖర్చవుతుంది. అన్న క్యాంటీన్‌లో నెలంతా కలిసినా రూ.450 చెల్లిస్తే మూడుపూటలా నాణ్యమైన భోజనం తినవచ్చు.



చిన్న మార్కెట్ అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

క్యూకట్టిన జనం

హిందూపురంలో రెండుచోట్ల అన్న క్యాంటీన్లు ప్రారంభించగా మొదటిరోజే పేదలు, మధ్యతరగతి ప్రజలతోపాటు చిరువ్యాపారులు, కూలీలు, క్యూకట్టారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని క్యాంటీన్‌లో ఉదయం ఆలస్యంగా ప్రారంభమైనా 350మంది అల్పాహారం తీసుకున్నారు. మధ్యాహ్నం 300 దాటినట్లు నిర్వాహకులు తెలిపారు. హిందూపురానికి రోజూ వేలాది మంది ఉపాధి కోసం వస్తుంటారు. వీరిలో చాలామంది కూలీలు, చిరువ్యాపారులు, ఇళ్లు, షాపులవద్ద పనిచేసేవారుంటారు. వారికి నెలకు రూ.6వేల నుంచి రూ.10వేలు వేతనం వస్తుంది. ప్రస్తుతం ప్రైవేటు హోటల్‌లో మూడుపూటలా భోజనం చేయాలంటే రూ.250 చెల్లించాలి. ఈలెక్కన నెలకు రూ.7500 అవుతుంది. దీంతో వారు కడుపుమాడ్చుకుని ఒకపూట తిని, మరోపూట పస్తులుండి పనులు చేస్తుంటారు. ఇకమీదట నెలంతా కలిసి రూ.450కే మూడుపూటలా భోజనం చేయవచ్చు. ఈ లెక్కన కూలీలు, చిరువ్యాపారులకు నెలకు రూ.5వేలదాకా ఆదా అవుతుంది.



భోజనం కోసం క్యూకట్టిన జనం

మాలాంటి వారికి ఎంతో మేలు



జిరాక్స్ సెంటర్‌లో రోజుకు రూ.300 కూలికి పని చేస్తా. ప్రైవేటు హోటల్‌లో భోజనం చేయాలంటే రెండు పూటలకు రూ.150 అవుతుంది. అన్న క్యాంటీన్‌లో నెలంతా మూడుపూటలా తిన్నా రూ.450 ఖర్చవుతుంది. మాలాంటి వారు రోజూ పట్టణానికి వచ్చేవారికి అన్న క్యాంటీన్ కడుపునింపనుంది.

- నారాయణప్ప, జిరాక్స్ సెంటర్ కార్మికుడు

చంద్రన్నకు రుణపడి ఉంటాం



మాలాంటి పేదలు ఆసుపత్రులకు వచ్చినపుడు మందులకే డబ్బులుండవు. ప్రైవేటు హోటళ్లలో భోజనం చేయాలంటే రోజుకు ఒకరికి రూ.300 ఖర్చవుతుంది. ఒక రోగివద్ద ఇద్దరు ఉంటే రోజుకు రూ.500 కావాలి. మహానుభావుడు చంద్రబాబు అన్న క్యాంటీన్ ప్రారంభించడంతో మాలాంటి పేదలకు కడుపునిండా రూ.5కే భోజనం దొరుకుతుంది. చంద్రన్నకు రుణపడి ఉంటాం.

-లక్ష్మీదేవి, పెడబల్లి

పనుల కోసం వచ్చేవారికి ఎంతో మేలు



పనుల కోసం మాలాంటి వారు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి నిత్యం వేలాదిమంది పురానికి వస్తుంటారు. హోటళ్లలో ధరలకు భయపడి భోజనం చేయకుండా కడుపు మాడ్చుకుని ఇంటికి వెళ్లేవారం. ఇప్పుడు అన్న క్యాంటీన్‌లో భోజనం చేసి, పని ముగించుకుని ఊరికి వెళ్లవచ్చు.

- తిప్పేస్వామి, అగళి

వృద్ధులకు తప్పనున్న పస్తుల తిప్పలు



మాలాంటి వృద్ధులు నిత్యం ఎంతోమంది పట్టణానికి వస్తుంటాం. భోజనం ధరకు భయపడి పస్తులుండేవారం. ఇక మీదట అన్న క్యాంటీన్‌లో కడుపునిండా భోజనం చేసి వెళ్లవచ్చు.

- ఓబుళప్ప, పెద్దగుడ్డంపల్లి

నాణ్యతగా ఉంది



అన్న క్యాంటీన్‌లో భోజనం నాణ్యతగా ఉంది. రూ.5కే కడుపు నిండా భోజనం పెడుతున్నారు. మాలాంటి ఆటోడ్రైవర్లకు ఇది ఎంతో ఉపయోగం. నిన్నటివరకు ఉదయం ఇంట్లో తినివస్తే సాయంత్రం వరకు కడుపుమాడ్చుకునే వారం. హోటళ్లలో భోజనం చేయాలంటే ధరలకు భయపడేవారం. ఇకమీదట మూడుపూటలా అన్న క్యాంటీన్‌లో కడుపునిండా భోజనం చేస్తాం.

- సాయినాథ్, ఆటోడ్రైవర్

బాలయ్య టైం.. అంటే టైమే..

ముహూర్త సమయం కోసం పది నిమిషాలు ఆగిన ఎమ్మెల్యే, కలెక్టర్

హిందూపురం, ఆగస్టు 16: సాధారణంగా రాజకీయాల్లో ఉన్న నాయకులు చెప్పిన సమయానికి రారు, వచ్చినా పెట్టిన ముహూర్తానికి ముందో.. వెనుకో.. పాల్గొనడం సర్వసాధారణం. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాత్రం టైం అంటే టైమే. ముందుగా వచ్చినా ముహూర్త సమయం కోసం ఎంతసేపైనా ఆగుతారు. ముహూర్త సమయం మించి పోతుందంటే మంత్రి వస్తారన్నా ఆగరు. అది శుక్రవారం రుజువైంది. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొదట ఒక అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ముహూర్తం ముగుస్తుందని రిబ్బన్ కట్ చేసి, అల్పాహారాన్ని పేదలకు అందించారు. అక్కడి నుంచి చిన్న మార్కెట్‌లో ఉన్న అన్న క్యాంటీన్ వద్దకెళ్లారు. అక్కడ ఉ.8.45 గంటలకు ముహూర్తం పెట్టారు. దీంతో ఉ.8.35కి అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే ముహూర్త సమయం కోసం పది నిమిషాలపాటు అక్కడే ఉండిపోయారు. మధ్యలో ఒకసారి జిల్లా కలెక్టర్ చేతన్.. ముందుకు వెళదామన్నా సమయం ఉందని చెప్పారు. దీంతో కలెక్టర్, సబ్‌కలెక్టర్ నాయకులు నిలబడిపోయారు. ముహూర్త సమయం అయ్యేసరికి ముందుకు వెళ్లి రిబ్బన్ కట్ చేశారు. దీంతో కార్యక్రమానికి హాజరైన నాయకులు, అధికారులు బాలయ్య టైం అంటే టైమే అని చర్చించుకున్నారు.

ఇద్దరు ఏఎస్పీల బదిలీ

పుట్టపర్తి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఏఎస్పీలను బదిలీలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ఏఎస్పీగా పనిచేస్తున్న విష్ణును ఏసీబీకి బదిలీ చేశారు. అలాగే సెబ్ ఏఎస్పీగా పనిచేస్తున్న నాగభూషణరావును తిరుపతి ఎల్అండ్ఓ అదనపు ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

విజన్-2047కి ప్రణాళికలు రూపొందించండి

- కలెక్టర్ చేతన్ ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి, ఆగస్టు 16: విజన్-2047కి సంబంధించి జిల్లాలో ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చేతన్.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం విజన్ డాక్యుమెంట్ రూపకల్పనపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు, పరిస్థితులు, అభివృద్ధికిగల అవకాశాలతో డాక్యుమెంట్ సిద్ధం చేయాలన్నారు. ఆరోగ్యం, సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, సామాజిక పురోగతి, పర్యావరణ సుస్థిరత, స్థిరమైన అభివృద్ధి వివరాలను అందులో పొందుపరచాలన్నారు. 2024 నుంచి 2029 వరకు ఆయా శాఖల పరిధిలో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమీక్షలో డీఆర్వో కొండయ్య, సీపీఓ విజయకుమార్, విద్యాశాఖ అధికారి జయచంద్ర, వ్యవసాయాధికారి సత్యనారాయణ, ఏడీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పురం మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా

వైసీపీకి సైతం..

హిందూపురం, ఆగస్టు 16: స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తన పదవికి, వైసీపీకి రాజీనామా చేసినట్లు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. చైర్‌పర్సన్ ఇంద్రజతోపాటు ఎనిమిది మంది వైసీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే బాలయ్య సమక్షంలో గురువారం రాత్రి టీడీపీలో చేరిన విషయం విదితమే. రెండురోజుల క్రితమే వైసీపీకి రాజీనామా చేస్తూ జిల్లా అధ్యక్షుడు, పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి ఫ్యాక్స్ ద్వారా లేఖను పంపినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి ఇంద్రజ రాజీనామా చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈనెల 20న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి చైర్‌పర్సన్ రాజీనామాను సభ్యులు ఆమోదించనున్నారు. ఆమె 19వ వార్డు కౌన్సిలర్‌గా కొనసాగుతారు. దీంతో తెలుగుదేశం పార్టీ తరఫున చైర్మన్ ఎంపికకు మార్గం సుగమమైంది.



మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే కందికంట

కదిరికి నిధులివ్వండి

మంత్రి నారా లోకేశ్‌కు కందికుంట వినతి

కదిరి, ఆగస్టు 16: నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.. విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌కు విన్నవించారు. విజయవాడలో మంత్రిని ఎమ్మెల్యే శుక్రవారం కలిశారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ఆయనతో చర్చించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఉపాధి, సాగు, తాగునీరు, భూగర్భ మురుగునీటి కాలువ తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దీనిపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేసి, నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఆ టీచర్ మాకొద్దు..

సోమందేపల్లి కేజీబీవీ విద్యార్థినుల ఆందోళన



నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

హిందూపురం (సోమందేపల్లి), ఆగస్టు 16: తమను గతంలో వేధించిన హిందీ టీచర్ శాలిదేవి వద్దంటూ సోమందేపల్లి మండలంలోని మండలంలోని పాపిరెడ్డిపల్లి లోగల కేజీబీవీ విద్యార్థినులు శుక్రవారం తరగతులను బహిష్కరించి, ఆందోళనకు దిగారు. గతంలో ఇన్‌చార్జి ఎస్ఓగా ఉంటూ శాలిదేవి తమను వేధించారంటూ విద్యార్థినులు ఆరోపించారు. దీనిపై విద్యార్థినులు.. బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు లేఖ రాశారు. అదికాస్త సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై స్పందించిన మంత్రి సవిత స్వయంగా కేజీబీవీని సందర్శించి, ఎస్ఓ అనిత, ఇన్‌చార్జి ఎస్ఓగా పని చేస్తున్న శాలిదేవిపై చర్యలకు ఆదేశించారు. జిల్లా విద్యాధికారి విచారణ చేపట్టి, ఇరువురిని టర్మినేట్ చేస్తూ నెల రోజుల క్రితం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 15న తిరిగి శాలిదేవిని విధుల్లోకి తీసుకోవడంతోపాటు పాపిరెడ్డిపల్లి కేజీబీవీకి నియమించారు. శుక్రవారం ఉదయం విధుల్లోకి చేరిన శాలిదేవిని చూసి విద్యార్థినులు ఆశ్చర్యానికి లోనయ్యారు. తరగతులను బహిష్కరించి, ఆ టీచర్ వద్దనీ, ఆమెను ఇక్కడి నుంచి పంపించేయండంటూ నినాదాలు చేశారు. ఆమె ఇక్కడ పనిచేస్తే తాము పాఠశాలలను వదిలి వెళ్లిపోతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎస్ ఓ సుబ్బలక్ష్మి.. సమాచారాన్ని ఎంఈఓ ఆంజనేయులు నాయక్‌కు తెలిపారు. హుటాహుటిన ఆయన కేజీబీవీకి చేరుకుని, విచారణ చేపట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులతో సమన్వయ సమావేశం ఏర్పాటుచేసి, అభిప్రాయాలు సేకరించారు. విద్యార్థులందరూ హిందీ టీచర్ శాలిదేవి పాఠశాలకు వస్తే.. తాము వెళ్లిపోతామని రాతపూర్వకంగా తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

నిరుద్యోగ యువతకు తీపికబురు

నైపుణ్యాల పెంపునకు ప్రభుత్వం శ్రీకారం

అనంతపురం సెంట్రల్/ రూరల్, ఆగస్టు 16: నిరుద్యోగ యువతలో నైపుణ్యాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్హత కలిగిన యువతకు ఉచిత శిక్షణ కార్యక్రమం చేపట్టింది. ఇందుకోసం స్కిల్ హబ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. స్థానిక వనరులు, డిమాండ్‌కు అనుగుణంగా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించింది. జిల్లాలో ఎనిమిది స్కిల్ హబ్ సెంటర్లను ఏర్పాటుచేసి ఒక్కో కేంద్రంలో 30మందికి శిక్షణ ఇవ్వనుంది. నార్పల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ ఎగ్జిక్యూటివ్. గుంతకల్లు ఎన్‌ఏసీలో హెల్పర్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ సర్వేయర్. తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్, డేటా ఎంట్రీ ఆపరేటర్. ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అసిస్టెంట్ సర్వేయర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, కళ్యాణదుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, అసిస్టెంట్ సర్వేయర్, అనంతపురం ఎన్‌ఏసీలో హెల్పర్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ సర్వేయర్, రాయదుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డేటా ఎంట్రీ, గుంతకల్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డెస్క్‌టాప్ పబ్లిషింగ్, వెబ్ డెవలపర్ కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్లు శుక్రవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

సహాయక కేంద్రాల నంబర్ల వివరాలు

కేంద్రం	నంబరు
అనంతపురం	7995482414
శింగనమల	9010039901
తాడిపత్రి	9133004626
గుంతకల్లు	8096763970
ఉరవకొండ	7013800115
కళ్యాణదుర్గం	9010965230
రాప్తాడు	7075657772
రాయదుర్గం	91829203811

ఉపాధి కల్పనే ధ్యేయం: ఆనంద్ రాజ్‌కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

18నుంచి 30 సంవత్సరాలు కలిగిన నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పించడమే ధ్యేయంగా స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేశాం. జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో మూడునెలల ఏకకాలంలో 480మందికి శిక్షణ ఇస్తాం. 19లోగా క్యూఆర్ కోడ్ లేదా https //forms.gle/fyvyjDQL3HTmEaje8 ద్వారా రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులు వారి సమీపంలోని కేంద్రాల్లో విద్యార్హత సర్టిఫికెట్స్, ఆధార్, పాస్‌పోటోలను సమర్పించాలి.

చీనీ టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 16: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 267టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.25

అనంతపురం రూరల్, ఆగస్టు 16: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.25తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం 4500 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.14, కనిష్ఠ ధర రూ.6?పలికినట్లు ఆయన తెలిపారు.

'జీడిపల్లికి' ఇన్‌ఫ్లో 643 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఆగస్టు 16: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు శుక్రవారం 643 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 0.466 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

ఇక్కడ ఉండలేం !

- గడేకల్లు ఎస్సీ హాస్టల్ విద్యార్థులు
- రోజుకొకరు కసువు ఊడ్చేలా చార్టు తయారీ
- మందుబాబులకు అడ్డాగా వసతి గృహం
- పక్కదారి పడుతున్న బియ్యం, సరుకులు
- అసాంఘిక కార్యకలాపాలపై గ్రామస్థుల ఆగ్రహం

విడపనకల్లు, ఆగస్టు 16: మండలంలోని గడేకల్లు ఎస్సీ బాలుర వసతి గృహంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని గ్రామ పెద్దలు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంగా వార్డెన్‌ను నిలదీస్తున్నారు. గ్రామ పెద్దలు భీమలింగప్ప, శ్రీనివాసులు, హరి, పరమేష్‌లు మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీ హాస్టల్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారినా వార్డెన్ పట్టించుకోవటంలేదన్నారు. 65 మంది విద్యార్థులు ఉన్న హాస్టల్‌లో ఒక వంట మనిషి మాత్రమే ఉన్నారన్నారు. ఇతడు విద్యార్థులు చేత మద్యం తెప్పించుకోవటం, అక్కడికి వచ్చిన తన స్నేహితులకు కూడా మద్యం తెప్పించి అక్కడే తాగుతూ ఖాళీ ప్యాకెట్లు పడేస్తున్నాడని ఆరోపించారు. హాస్టల్ ప్రాంగణంలో ఎక్కడ చూసినా కర్ణాటక మద్యం బాటిళ్లు కనిపిస్తాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఎస్సీ విద్యార్థులను ఇంత దారుణంగా ఇబ్బంది పెట్టటం సరికాదన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టడం లేదన్నారు. మరుగు దొడ్లు అధ్వానంగా ఉన్నా పట్టించుకోరా మీ ఇంట్లో మీ పిల్లలకు ఇలా ఉంటే చూస్తూ ఊరుకుంటారా అని ప్రశ్నించారు. పిల్లలు చేత కసువు ఊడిపించడం, డ్రైనేజీలు క్లీన్ చేయించటం, గదులను కడిగించడం వంటి పనులు చేయించడం దారుణమని మండిపడ్డారు. కోడిగుడ్లు వారానికి ఐదుసార్లు ఇవ్వాల్సి ఉండగా మూడు రోజులే ఇస్తున్నారన్నారు. ఒక లీటర్ పాలలో రెండు జగ్గుల నీరు కలిపి 65మంది పిల్లలు తాగాలంటా! ఇదెక్కడి అన్యాయమని ప్రశ్నించారు. విద్యార్థులకు భోజనం సక్రమంగా పెట్టకుండా బియ్యాన్ని, సరుకులను బయటి వ్యక్తులకు విక్రయిస్తుండటంతో గత మంగళవారం రాత్రి కాపు కాచి బియ్యం తరలిస్తున్న దృశ్యాలను ఫొటోలు తీసినట్లు గ్రామస్థులు వెల్లడించారు. వర్షాకాలంలో గోడలకు విద్యుత్ సరఫరా అయ్యి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా వార్డెన్ పట్టించుకోవడం లేదన్నారు. హాస్టల్‌లో తమకు రక్షణ లేకుండా పోయిందంటూ విద్యార్థులు ఆవేదన చెందారు. ఈ వార్డెన్ మాకు వద్దు అంటూ నినాదాలు చేశారు. పరిస్థితులు ఇలా ఉంటే ఎలా హాస్టల్‌లో ఉండేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



హాస్టల్ ప్రాంగణంలో కర్ణాటక మద్యం ప్యాకెట్లు



పాడైపోయిన స్నానాల గదులు



స్వీపింగ్, క్లీనింగ్ చార్టును చూపుతున్న విద్యార్థులు



వార్డెన్‌తో గ్రామస్థుల వాగ్వాదం



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఎవరూ పట్టించుకోరు



ఎస్సీ హాస్టల్‌లో ప్రతిరోజూ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా పట్టించుకునే వారేలేరు. ఇక్కడ విద్యార్థుల చేతనే మందు బాబులకు మందు తెప్పించి ఇస్తున్నారు. రాత్రి సమయంలో వ్యభిచారం జరుతున్నా ఒక్కరు స్పందించరు. వార్డెన్ హాస్టల్‌కు అస్సలు రావటంలేదు. బియ్యాన్ని బయటి వ్యక్తులకు అమ్ముకుంటున్నారు. హాస్టల్ ప్రహరీ ముందే కర్ణాటక మద్యం అమ్ముతున్నా అధికారులు స్పందించటంలేదు.

- హరి, గ్రామస్థుడు గడేకల్లు

భోజనం కూడా పెట్టటం లేదు



ఎస్సీ హాస్టల్‌లో వివిధ గ్రామల నుంచి వచ్చిన విద్యార్థులు ఉన్నారు. కానీ ఇక్కడ విద్యార్థులకు సరైన భోజనం పెట్ట కుండా బియ్యాన్ని, సరుకులను కిరాణ షాపులకు అమ్ముకుం టున్నారు. హాస్టల్‌లోకి పాములు, పందులు వస్తున్నాయి. డ్రైనేజీలు, గదులను విద్యార్థులే క్లీన్ చేయాలని చార్టులు తయారు చేయించి పనులు చేయిస్తున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకుని విద్యార్థులకు న్యాయం చేయాలి.

- పరమేశ్, గడేకల్లు గ్రామస్థుడు

మద్యం మేమే తెచ్చివ్వాలి



మాది గుంతకల్లు. ఈ హాస్టల్‌లో ఉంటూ గత ఏడు సంవత్సరాలుగా చదువుకుంటున్నా. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నా. సంవత్సర కాలం నుంచి మాకు హాస్టల్‌లో నరకం చూపిస్తున్నారు. వార్డెన్ అస్సలు ఉండరు. ఎక్కడెక్కడి వారో వస్తారు. రాత్రి సమయంలో ఇక్కడే తాగి తిని పోతూ ఉంటారు. ఇక్కడ సిబ్బంది మా చేతనే వారికి మద్యం తెప్పించి ఇస్తారు. తీసుకురాక పోతే కొట్టి వేధిస్తారు.

- వీరేష్, 10వ తరగతి విద్యార్థి

బాత్‌రూంలు కూడా లేవు



హాస్టల్‌లో బాత్‌రూంలు లేవు. టాయిలెట్స్ లేవు. కనీసం స్వీపర్లు కూడా లేరు. టైంకి సరైనా భోజనం లేదు. నరకం ఎక్కడో కాదు ఈ హాస్టల్‌లోనే ఉంది. రాత్రి సమయాల్లో గదుల్లో నిద్రిస్తున్నా సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి కిటికీలు కొడుతున్నారు. ఒక్కోసారి డోర్లు తెరుచుకొని గదుల్లోకి వస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవటంలేదు.

- జి. వంశీ, 10వ తరగతి

రోజూ ఒకరు కసువు ఊడ్చాలి



రూంల్లో కసువు మేమే ఊడ్చుకోవాలి. స్వీపర్ లేదు. కసువు రోజుకొకరు చెప్పున ఊడ్చాలి. ఇందు కోసం ఒక చార్టు తయారు చేశారు. కసువు ఊడ్చి, బండలు కడగకపోతే ఆ రోజు మాకు భోజనం పెట్టరు. ఇక్కడ మందు తాగే వాళ్లు ఎక్కువైపోయారు. రాత్రి అయితే చాలు ఎవరెవరో వస్తూ పోతుంటారు. ఎస్సీ హాస్టల్స్ ఇలానే ఉంటాయటా బీసీ హాస్టల్స్‌లో అయితే మంచాలు, బెడ్‌లు ఉంటాయట మాకు ఎలాంటి సౌకర్యాలు ఉండవు అని బెదిరిస్తున్నారు. హాస్టల్‌లో వార్డెన్ అస్సలు ఉండరు. సిబ్బంది కూడా ఉండరు.

- అశోక్, 8వ తరగతి విద్యార్థి

అలాంటివేం జరగడం లేదు

హాస్టల్‌లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగటం లేదు. విద్యార్థులకు మెనూ ప్రకారమే భోజనం పెడుతున్నాం. స్వీపర్లు లేనందున ఎవరి రూముల్లో వాళ్లు స్వీపింగ్ చేసుకోవాలని సూచించా. అంతే కానీ రోజు ఒకరు కసువు ఊడ్చాలని చెప్పలేదు. ఎటువంటి చార్టును తయారు చేయలేదు.

-జగన్నాథ్, హాస్టల్ వార్డెన్ గడేకల్లు

ఆట మొదలైందా?

- ఆడుదాం ఆంధ్ర పేరుతో దోపిడీ
- రూ.60 లక్షలకుపైగా నిధుల స్వాహా
- గతంలో పనిచేసిన చీఫ్‌కోచే సూత్రధారి?
- నిధుల గోల్‌మాల్‌పై పోలీసులకు ఫిర్యాదు
- తప్పుల సర్దుబాటుపై రహస్య యత్నాలు
- తిన్న సొమ్ము కూటమి ప్రభుత్వం కక్కించేనా?



క్రీడాకారులు లేని టెంట్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 16: 'తింటే' అరుగుతుందా లేదా అన్న వివేచన లేదు. అది ప్రభుత్వ సొమ్ము అయితే చాలు మింగేద్దాం అనే రీతిలో కొందరు అధికారులు గత వైసీపీ ప్రభుత్వ పాలనలో వ్యవహరించారు. ఇందుకు ఉదాహరణే ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు. క్రీడా పోటీల పేరుతో జిల్లాలో సంబంధిత శాఖాధికారి అప్పనంగా దోచేశారు. క్రీడాకారులకు అరకొర సౌకర్యాలు కల్పించి, నాసిరకమైన క్రీడా సామగ్రి అందజేసి మమ అనిపించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) చీఫ్‌కోచ్‌గా పనిచేసిన నరసింహారెడ్డి రూ.60లక్షల వరకు కాజేసినట్లు సమాచారం. అప్పటి జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు నిధులు ఖర్చు చేశారు. జిల్లా కన్వీనర్‌గా డీఎస్‌ఏ చీఫ్‌కోచ్‌లను నియమించారు. నిధుల వినియోగం మొత్తం చీఫ్ కోచ్‌ల ద్వారానే జరిగింది. అయితే నిధుల స్వాహా విషయం బయటపడక ముందే అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దల అండతో డీఎస్‌ఏ చీఫ్‌కోచ్‌గా ఉన్న నరసింహారెడ్డి హడావుడిగా విజయవాడకు బదిలీపై వెళ్లారు. నిధులు స్వాహా చేసి జాగ్రత్తగా తప్పుకున్నానని ఆయన అనుకుంటున్న తరుణంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణ, నిధుల గోల్‌మాల్‌పై ప్రభుత్వానికి, పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో నిధుల స్వాహా అంశాలు ఒక్కొక్కటిగా బయటకి వస్తున్నాయి. డీఎస్‌ఏ చీఫ్‌కోచ్ ఒక్కరే నిధులు స్వాహా చేశారా లేక ఇందులో అధికారులు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం ఉందా అనే అంశాలు విచారణలో నిగ్గుతేలనున్నాయి. విజయవాడకు బదిలీపై సాధారణ కోచ్‌గా వెళ్లిన నరసింహారెడ్డికి తిరిగి గుంటూరు డీఎస్‌డీఓ బాధ్యతలు అప్పగించడంపై క్రీడాలోకం విస్మయం వ్యక్తం చేస్తోంది. ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలకు అప్పట్లో వైసీపీ ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో మద్దతు పలికిన చీఫ్‌కోచ్‌కు ఉన్నత పోస్టు ఇచ్చి అందలం ఎక్కించడంపై విమర్శలు వినవస్తున్నాయి.



నాసిరకంగా క్రికెట్ కిట్లు

లెక్కలు తేలాలి



ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల సమయంలో జిల్లాలో నేను లేను. ఆ పోటీల సమయంలో డీఎస్‌డీఓగా నరసింహారెడ్డి ఉన్నారు. అయితే ఇప్పటికే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలపై అనేక మంది ఫిర్యాదు చేస్తున్నారు. అసలు జిల్లాలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు ఎంత నిధులు వచ్చింది. ఎంత ఖర్చు పెట్టారో ఆ లెక్కలన్నీ తేలాల్సి ఉంది. ప్రభుత్వ సొమ్ము ప్రతిపైసాకు లెక్క చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉంది. శాప్ నుంచి కొన్ని వివరాలు తీసుకోవాలి, ఇక్కడ ఎంత ఖర్చు పెట్టారనే వివరాలను తెలుసుకోవాలి. అన్నీ వివరాలతో సమగ్రంగా శాప్, ప్రభుత్వానికి నివేదిస్తాం.

- షేక్ షఫీ, డీఎస్‌డీఓ

జిల్లాకు రూ.1.2 కోట్ల నిధులు

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు జిల్లాకు రూ.1.2కోట్ల వరకు నిధులు మంజూరు చేశారు. ఇందులో గ్రామ-వార్డు స్థాయి నుంచి మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయిలలో నిర్వహించారు. భోజనం, నిర్వహణ, ప్రైజ్ మనీ, ట్రాన్స్ పోర్ట్ అని నాలుగు కేటగిరీలలో నిధులు చెల్లించారు. అయితే గ్రామ-వార్డు స్థాయి నుంచి జిల్లా స్థాయిలో భోజనాలు సంగతి దేవుడెరుగు....కనీసం తాగునీరు, నీడ ఏర్పాటు చేయలేదు. జిల్లాకు చెల్లించిన రూ.1.2కోట్లలో గత డీఎస్‌ఏ చీఫ్‌కోచ్ ప్రస్తుతం గుంటూరు జిల్లా డీఎస్‌డీఓగా పనిచేస్తున్న నరసింహారెడ్డి రూ.60లక్షల వరకు స్వాహా చేసినట్లు ఆశాఖలోనే చర్చించుకుంటున్నారు.

రహస్యంగా జిల్లాకు వచ్చి వెళ్లిన మాజీ చీఫ్‌కోచ్

ఆడుదాం ఆంధ్రా నిధుల గోల్‌మాల్‌లో కీలకపాత్రధారిగా ఉన్న అప్పటి డీఎస్‌ఏ చీఫ్‌కోచ్ బదిలీపై వెళ్లిన తర్వాత సుమారు పది దఫాలుగా జిల్లాకు రహస్యంగా వచ్చివెళ్లినట్లు సమాచారం. నిధులు దుర్వినియోగంలో విషయాలు బయటకు పొక్కకుండా ఉండేందుకు అన్ని సర్దుబాటు చేసుకోవడానికే జిల్లాకు రహస్యంగా వచ్చి వెళ్లారని క్రీడాభిమానులు చెబుతున్నారు.

రూ.60 లక్షలకు పైగా నిధుల స్వాహా



డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియం

జిల్లాలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల పేరుతో సుమారు రూ.60లక్షలకు పైగా నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. జిల్లాకు మంజూరైన రూ.1.2కోట్ల నిధులను వివిధ మార్గాల్లో కాజేసినట్లు సమాచారం. భోజనాలకు రూ.20లక్షలు మంజూరైతే కనీసం రూ.ఐదు లక్షలు కూడా ఖర్చు పెట్టిన దాఖలాలు లేవు. ఇక ట్రాన్స్‌పోర్ట్‌కు రూ.30లక్షలకు పైగా నిధులు మంజూరు కాగా రూ.15లక్షల వరకు మాత్రమే ఖర్చు పెట్టినట్లు తెలుస్తోంది. నిర్వహణకు రూ. 20లక్షలు నిధులు మంజూరు కాగా రూ.10లక్షలు కూడా ఖర్చు పెట్టలేదు. ప్రైజ్‌మనీ కింద రూ.50లక్షల వరకు నిధులు మంజూరు చేయగా రూ.30లక్షలు వరకు మాత్రమే చెల్లించినట్లు తెలుస్తోంది. మొత్తంగా జిల్లాలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలతో క్రీడాకారులకు ఏమోగానీ క్రీడాశాఖ అధికారులకు మాత్రం బ్రహ్మాండంగా మేలు జరిగిందనే విమర్శలు ఉన్నాయి.

ఉత్సాహంగా కేపీఎల్ క్రికెట్ పోటీలు



కరణం చిక్కప్ప క్రీడామైదానంలో జరుగుతున్న కేపీఎల్ క్రికెట్ పోటీలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 16: యువత లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేం దుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కేపీఎల్ (కళ్యాణదుర్గం ప్రీమియర్ లీగ్) క్రికెట్ పోటీలను ప్రారంభించారు. పట్టణంలోని కరణం చిక్కప్ప క్రీడామైదానంలో గురువారం ఈ పోటీలను ప్రారంభించారు. ఈ నెల 18 వరకు 32 మ్యాచ్‌లు జరుగనున్నాయి. విజేత జట్టుకు రూ.2 లక్షలు, రన్నర్లకు రూ. లక్ష బహుమతులు ప్రకటిం చారు. క్రికెట్ జట్లకు క్రీడా దుస్తులు, బూట్లు ఉచితంగా అందజేశారు.

యువతకు స్ఫూర్తి



ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఐపీఎల్ తరహాలో కేపీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభించడం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ క్రికెట్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయి.

- అక్కులప్ప, కెప్టెన్, టీమ్ తారక్ టైగర్స్

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



కేపీఎల్ పోటీలు నిర్వహించి మాలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఎమ్మెల్యే సురేంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయం. ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగే పోటీలను చూడటానికి ఎంతో మంది క్రీడాభిమానులు వస్తున్నారు.

- జయరాజ్, కెప్టెన్, మీసేవా ఫైటర్స్

డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 16: కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ బాలిక కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ద్వితీయ సెమిస్టర్ రీవాల్యుయేషన్ పరీక్షా ఫలితాలను శుక్రవారం ప్రిన్సిపాల్ శంకరయ్య విడుదల చేశారు. జూలై లో నిర్వహించిన బీఎస్సీ, బీకాం హానర్స్ పరీక్షల్లో ఫెయిల్ అయిన వారికి రీవాల్యుయేషన్ చేసినట్లు వెల్లడించారు. ఫలితాలకోసం కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మిరంగయ్య, సీతః శివశంకర్, అధ్యాపకులు రామలింగారెడ్డి, రమాదేవి పాల్గొన్నారు.

ఉక్కిరిబిక్కిరి

మరో మూడురోజులు ఇదే పరిస్థితి

బుక్కరాయసముద్రం, ఆగస్టు16: ఉమ్మడి జిల్లాలో వేసవి కాలాన్ని తలపించేలా ఎండ, ఉక్కపోత ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. నాలుగు రోజుల నుంచి ఉమ్మడి జిల్లాలో భరించలేని ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వర్షాకాలంలో కూలర్లు, ఏసీల కోసం వెంపర్లాడే పరిస్థితి. ఆగ్నేయ అరేబియా సముద్రం, దక్షిణ కేరళ తీరం మీదగా ఏర్పడిన ఉపరిత ఆవర్తనం ప్రస్తుతం కర్ణాటక, సరిహద్దు ప్రాంతాల మీద విస్తరించి ఉంది. ఈ ప్రభావంతోనే ఉమ్మడి జిల్లాలో రానున్న నాలుగు రోజులు పగటి ఉష్ణోగ్రతలు పెరుగతాయని వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణ స్వామి తెలిపారు. వీటితో పాటు వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు ప్రభావంతో మరో నాలుగురోజులపాటు ఉక్కపోత తీవ్రంగా ఉంటుందని తెలిపారు. ఉపరితల ఆవర్తనం విస్తరించడంతో గాలిలో తేమ శాతం పెరగడం ఈ ఉక్కపోతకు ప్రధాన కారణమన్నారు. ప్రస్తుతం జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 33-34 సాధారణ డిగ్రీల సెల్సియస్ నమోదు కావాలన్నారు. అయితే సాధారణం కంటే అదనంగా 2-3 డిగ్రీల సెల్సియస్ నమోదు అయినట్లు శాస్త్రవేత్త తెలిపారు.

రానున్న ఐదురోజులకు వర్ష సూచన

ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజులు తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. పగటి ఉష్ణోగ్రత 35.8- 36.4 డిగ్రీల సెల్సియస్ నమోదు అవుతుందన్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రత 25.4- 25.6 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చుని తెలిపారు. గాలులు గంటకు 3కి.మీ నుంచి 7 కిమీవేగంతో వీచే అవకాశం ఉందన్నారు.

వైద్యుల ఆందోళన ఉధృతం



ఆస్పత్రి ఎదుట రాస్తారోకో చేస్తున్న జూనియర్ డాక్టర్లు, పీజీలు

అనంతపురం టౌన్, ఆగస్టు 16: ఇటీవల కోల్‌కతా వైద్య కళాశాలలో పీజీ మహిళా డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనను నిరసిస్తూ అనంత జిల్లాలో డాక్టర్లు ఆందోళన ఉధృతం చేశారు. అఘాయిత్యానికి పాల్పడిన దుర్మార్గుడిని కఠినంగా శిక్షించాలని, డాక్టర్ల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా బోధనాసుపత్రికి చెందిన జూనియర్ డాక్టర్లు, పీజీలు గతనాలుగు రోజులుగా వివిధ రూపాల లో నిరసనలు సాగిస్తూ వస్తున్నారు. శుక్రవారం వైద్య కళాశాలలో రిలేదీక్షలు సాగిస్తూ ఆస్పత్రి ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. శనివారం నుంచి విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఈమేరకు జిల్లా వైద్యకళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ మాణిక్యారావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావులకు సమ్మె నోటీస్ అందజేశారు.

బంద్‌కు మద్దతు

మహిళా డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్యచేయడం అన్యాయమని ఆందోళన చేస్తున్న డాక్టర్లపై మళ్లీ దాడులు చేయడం దుర్మార్గమని ఐఎంఏ నేతలు డాక్టర్ హేమలత, మనోరంజన్‌రెడ్డి, శ్రీకాంత్ పేర్కొన్నారు. అందుకే డాక్టర్ల ఆందోళనకు తాముకూడా మద్దతు ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా ఒక్కరోజు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు బంద్ చేస్తున్నామన్నారు. శనివారం ఉదయం 6గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు ఎలాంటి అత్య వసర కేసులకు చికిత్సలు అందించబోమని ఓప్రకటనలో తెలిపారు.

మెడికల్‌రెప్స్, నర్సింగ్‌హోమ్స్ అసోసియేషన్స్ సంఘీభావం

జూనియర్ డాక్టర్లు, పీజీల ఆందోళనలకు మెడికల్ రెప్స్ అసో సియేషన్ నాయకులు విశ్వనాథ్, మంజు, అమర్నాథ్ ఓ ప్రకటనలో సంఘీభావం తెలిపారు. అలాగే నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ నాయకులు సైతం శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు వైద్యసేవలు బంద్ చేస్తున్నట్లు ప్రకటించారు.

ప్రత్యామ్నాయ చర్యలపై వైద్యాధికారులు

హౌస్‌సర్జన్లు, పీజీలు నిరవధిక సమ్మెకు వెళుతుండటంతో జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకునేందుకు వైద్యాధికారులు అడుగులు వేస్తున్నారు. సమ్మె నోటీస్ ఇచ్చిన వెంటనే వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు, ఆయా విభాగాల హెచ్ఓడీలతో శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బంది కలగకుండా వైద్య సేవలు ఎలా అందించాలి? అందుకు ఎవరిని అలార్ట్ చేయాలని ఆలోచించారు. 29మంది సర్వీస్ పీజీలు, ఆరుగురు సీనియర్ రెసిడెంట్స్‌తో వైద్య సేవలు అందించాలని నిర్ణయం తీసుకున్నారు. అప్పటికీ ఇబ్బంది ఏర్పడితే ఐఎంఏ సహకారంతో ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులను, నర్సింగ్ కళాశాలల స్టూడెంట్స్‌ను తీసుకొని వైద్య సేవలు అందించేలా చూస్తామని ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ తెలిపారు. ఈసమస్య తెగే వరకు హెచ్ఓడీలు ఆస్పత్రిలో ఎక్కువ సమయం ఉండాలిని, రోగులకు అవసరమైన వైద్య సేవలు అందేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. జూనియర్‌డాక్టర్లు, పీజీలు సమ్మెకు దిగడంతో వైద్యసేవలపై ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పెరటి మొక్కల పంపిణీ

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 16 : స్థానిక ఇంటిగ్రేటెడ్ విలేజీ డైవలప్‌మెంట్ (ఐవీడీ) ఏకల్ గ్రామోతర్ ఫౌండేషన్ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి శేషాద్రి, మండల ఇన్‌చార్జి పిట్టా ప్రభాకరరెడ్డి శుక్రవారం పెరటి మొక్కలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ... ఇంటి ఆవరణంలో పండ్ల మొక్కలను సాగు చేసి.. వాటిని తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. పెరటి తోటల పెంపకానికి మామిడి, నిమ్మ, జామ, ఉసిరి తదితర మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. మండలంలోని రైతులకు ఉచితంగా మొక్కలు అందిస్తామన్నారు. అంతేకాకుండా యువతకు ఉచితంగా టైలరింగ్, కంప్యూటర్ శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు, యువత 79811 68356 ఫోన్ నెంబర్‌ను సంప్రదిం చాలని సూచించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ శ్రీరాములు, రాధాక్రిష్ణ, బీజేపీ జిల్లా యువ మోర్చా కార్యదర్శి నరేష్‌బాబు, ట్రైనర్ శ్రీనాథ్, గంగిశెట్టి, అభియాన్ ప్రముఖ్ ప్రసాద్ పాల్గొన్నారు.


మొక్కలు పంపిణీ చేస్తున్న ఐవీడీ ప్రతినిధులు

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్, ఆగస్టు 16: పట్టణంలోని శివానగర్‌కు చెందిన వృద్ధురాలు విజయలక్ష్మీ మోకాళ్ల నొప్పులు తాళలేక శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈమె కొంతకాలంగా తీవ్రమైన మోకాళ్ల నొప్పులతో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె శుక్రవారం తన ఇంటిలో ఉన్న గుర్తుతెలియని మాత్రలను అధిక మోతాదులో మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

తనకల్లు, ఆగస్టు 16: మండలంలోని గంగసానిపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లచెరువు మండలం ఓరువాయికి చెందిన బొలెరో వాహన డ్రైవర్ రమేష్ గాయపడ్డాడు. ఇతను తన వాహనంలో టమెటాలతో అన్నమయ్య జిల్లాలోని ముకలచెరువుకు బయలుదేరాడు. గంగసానిపల్లి సమీపంలో వాహనం వేగంగా వెళ్తున్న సమయంలో టైర్ పంచర్ కావడంతో బొలెరో అదుపు తప్పి పక్కకు పడిపోయింది. ఈ ప్రమాదంలో రమేష్ రెండు చేతులూ విరిగిపోయాయి. వందేమాతరం టీమ్ సభ్యులు రమేష్‌ను తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కదిరికి తరలించారు.

మాజీ ప్రధాని వాజపేయికి నివాళి

పుట్టపర్తి, ఆగస్టు 16: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కొండమ రాజు, హరికృష్ణ గౌడ్, జ్యోతి ప్రసాద్, బాలగంగాధర్, సునీవ్ వైట్ల, సురేంద్ర బాబు, కల్యాణ్, రామాంజినేయులు, నారాయణ పాల్గొన్నారు.


వాజపేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వ్యసనాలకు బానిసలై బస్సుల్లో చోరీలు

బత్తలపల్లి ఆగస్టు 16 : చెడు అలవాట్లకు బానిసలైన కొంతమంది మహిళలు బస్సుల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ నెల 12న బత్తలపల్లి నుంచి నార్పలకు వెళ్తున్న బస్సులో ఓ మహిళ వద్ద ఉన్న ఏడు తులాల బంగారు నగను ముగ్గురు మహిళా దొంగలు చోరీ చేశారన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గాలించిన పోలీసులు.. అదేరోజున ఆ మహిళా దొంగలను అరెస్టు చేశారని, ఆ నగను స్వాధీనం చేసుకొని.. వారిని రిమాండుకు తరలించినట్లు తెలిపారు. నిందితులను తమిళనాడు రాష్ట్ర హోసురు జిల్లా సిఫ్‌కాట్‌కు చెందిన కలయ్‌వాణి అలియాస్ కల్యాణి, రేఖలు, తిరువన్నామలై జిల్లా చెంగమ్ మండలం కట్టుమడువు గ్రామానికి చెందిన గాజుల భారతిగా గుర్తించామన్నారు. చెడు అలవాట్లకు బానిసలు కావడంతోనే వారు ఇలా దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. ఒంటరి మహిళలకు మత్తు మందు ఇచ్చి విలువైన వస్తువులు చోరీ చేయడమే వీరి లక్ష్యమన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ధర్మవరం రూరల్, ఆగస్టు 16: స్థానిక బాలికల ఎస్సీ హాస్టల్‌లోని 40 మంది విద్యార్థినులకు మానవత స్వచ్ఛందసేవా సంస్థ రూ.10 వేలు విలువ చేసే విద్యాసామగ్రిని శుక్రవారం పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు తెల్లం నారాయణమూర్తి మాట్లాడుతూ.. చదువుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు మంజునాథ్, వేణుగోపాల్, వెంకటేష్, రవి పాల్గొన్నారు.


విద్యాసామగ్రిని అందజేసిన సభ్యులు

బీజేపీ కండువాలతో వైసీపీ నేతల హవా

ముదిగుబ్బ, ఆగస్టు 16: బీజేపీ కండువాలు వేసుకున్న వైసీపీ నాయకులు హవా కూటమి పార్టీలో నడుస్తోందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. కొందరు వైసీపీ నాయకులు ఎన్నికల ముందు బీజేపీలోకి చేరారని, ఇప్పుడు కూటమి పేరు చెప్పుకొని వారు అజమాయిషీ చేస్తున్నారని, అలాంటి కోవర్టులను దూరం పెట్టాలని అన్నారు. కూటమి ముసుగులో ఉన్న వైసీపీ కోవర్టులపై చర్యలు తీసుకోవాలని మంత్రి సత్యకుమార్ యాదవ్, టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రైతు సంఘం కార్యదర్శి రమేష్‌బాబు, టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ పాల్గొన్నారు.

జీవో 117 రద్దు చేయాలి

ఓబుళదేవరచెరువు: విద్యావ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారిన జీవో నెంబర్ 117, 128ను వెంటనే రద్దు చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చడానికి సర్దు బాటు ప్రక్రియ కాకుండా అర్హులైన ఉపాధ్యాయులకు ఉద్యోన్నతులు కల్పించి భర్తీ చేయాల న్నారు. పాఠశాలలో కేవలం ఇంగ్లీషు మీడియంతో పాటు సమాంతరంగా తెలుగు మీడియం కొనసాగించాలని, సీబీఎస్‌సిలబస్‌లోకి మార్చిన పాఠశాలలు తిరిగి రాష్ట్ర సిలబస్‌లోకి మార్చాలన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

కొత్తచెరువు, ఆగస్టు 16: స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ వి. రత్న శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, ఫైల్స్‌ను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఐ రాజారమేష్‌కు సూచించారు. వివిధ కారణాలతో సీజ్ చేసిన వాహనాలను కోర్టులో నివేదించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు.

చిరుత సంచారం

నల్లచెరువు, ఆగస్టు 16: మండలంలోని జోగన్నపేట సమీపంలో శుక్రవారం రాత్రి ఓ చిరుత సంచరించింది. ఆ గ్రామం నుంచి లక్ష్మీకాంత్ పాల ఆటోలో జాతీయ రహదారి వైపు వెళ్తుండగా ఆ చిరుత పులిని చూశాడు. వెంటనే మండల కన్వీనర్ రాజశేఖర్‌కు తెలిపారు. ఆయన అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. చిరుతపులి పాదముద్రికల ఆధారంగా ఆ చిరుత పోలేవాండ్లపల్లి, కొత్తపల్లి వైపు వెళ్లినట్లు గుర్తించారు.

భాగ్యాల లక్ష్మీ రావమ్మా

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రత పూజలు

ధర్మవరం రూరల్, ఆగస్టు 16: వరలక్ష్మీ పండుగను జిల్లా వ్యాప్తంగా మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ శుక్రవారం పట్టణ, రూరల్ పరిధిలోని పలు దేవాలయాలు, ఇళ్లల్లో వ్రతాలు, పూజలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో మహిళలు సాముహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. అదే విధంగా సాలేవీధిలోని పెద్దమ్మ అమ్మవారి ఆలయంలో అర్చకులు వెంకటేష్ శర్మ విశేష పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా గాజుల అలంకరణ చేశారు. మహిళ భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.

పుట్టపర్తి: మండలంలో వరలక్ష్మీ పండుగ సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు వారివారి ఇళ్లల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు చేశారు. ముత్తైదువులకు పసుపుకుంకుమలు వాయినాలు అందజేసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కొందరు మహిళలు ఇళ్లలో వేద పండితులతో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

బత్తలపల్లి: బత్తలపల్లిలో లక్ష్మీ దేవాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమములో పూజారి రమణయ్య, రాజు, తిరపతయ్య, ప్రసాదు, పెద్దన్న, రామూర్తి, సురేష్, నాగరాజు పాల్గొన్నారు. అలాగే అమడగూరులోని చౌడేశ్వరీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. నల్లమాడ , నంబులపూలకుంట, తనకల్లు మండలాల్లోనూ వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒకరికొక్కరు పసుపు, కుంకుమతో వాయినం ఇచ్చి, పుచ్చుకున్నారు.



ధర్మవరం లక్ష్మీచెన్నకేశవ ఆలయంలో, సాలెవీధిలో గాజులతో పెద్దమ్మ అలంకరణ


పుట్టపర్తిలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు →





బత్తలపల్లి, అమడగూరు, చౌటకుంటపల్లి, కొక్కంటి క్రాస్‌లో ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మీ అమ్మవారు

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు

ముదిగుబ్బ, ఆగస్టు 16 : స్థానిక పాతవూరికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కోట్ల రమణ ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన దేశీయ ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ప్రారంభించారు. ముందుగా పరిటాల శ్రీరామ్ కోట్ల రమణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఆయన మాట్లాడుతూ... కోట్ల రమణ లేకపోవడం పార్టీకి తీరని లోటు అని, ఆయన మొదటి వర్ధంతి సందర్భంగా కుమారుడు కోట్ల మనోజ్ రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించడం అభినందనీయమని, కోట్ల రమణ ఆశయాలను మనోజ్ ముందుకు తీసుకెళ్తారని అన్నారు. రాతిదూలం లాగుడు పోటీలను ప్రారం భించి, ఆసక్తిగా తిలకించారు.

ఈ పోటీలను తిలకించడానికి వచ్చిన ఆరు వేల మందికి అన్నదానం చేశారు. పోటీల్లో విజేతలకు బహు మతులు అందజేశారు. మొదటి బహుమతి గుత్తి మండలం వెంగన్నగారిపల్లికి చెందిన మల్లికార్జున రూ.30 వేలు, రెండో బహుమతి వేముల మండలానికి చెందిన రామాంజినేయులు రూ.25 వేలు, మూడో బహుమతి వేంపల్లి మండలానికి చెందిన రమణ రూ.20 వేలు, నాల్గో బహుమతి తుగ్గలి మండలానికి చెందిన మస్తాన్ యాదవ్ రూ.15 వేలు, ఐదో బహుమతి ఆత్మకూరు మండలానికి చెందిన ఈశ్వరయ్య రూ. 10 వేలు, ఆరో బహుమతి వజ్రకరూరు మండలానికి చెందిన లాల్‌స్వామి రూ.8 వేలు, ఏడో బహుమతి గార్లదిన్నె మండలానికి చెందిన బాబావలి రూ.6 వేలు, ఎనిమిదో బహుమతి ఆత్మకూరు మండలానికి చెందిన రామాంజనేయులు రూ.4 వేలు, తొమ్మిదో బహుమతి ఆత్మకూరు మండలానికి చెందిన రామకృష్ణ రూ.2 వేలు అందజేశారు. బహుమతులను మండల టీడీపీ నాయకులు రమేష్ బాబు, కరణం ప్రభాకర్, తుమ్మల మనోహర్ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరీష్ బాబు, ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, సోమల ప్రకాష్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న పరిటాల శ్రీరామ్

కేవైసీ చేయించుకోండి

గాండ్లపెంట, ఆగస్టు 16: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంక్ త్వరలో ఆన్‌లైన్ కాబోతోందని, కావున ఖాతాదారులు కేవైసీ చేయించుకోవాలని స్థానిక ఆ బ్యాంక్ సీఈఓ షామీర్ తెలిపారు. ఖాతాదారులు వెంటనే ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్, సెల్‌నెంబర్, రెండు ఫొటోలు తీసుకొని కార్యాలయ సిబ్బందిని సంప్రందించలన్నారు. అలాగే పంట రుణాలను రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు.

నంబులపూలకుంట : మండలంలోని వ్యవసాయ సహకారం సంఘంలో సభత్వం పొందిన ప్రతిరై తప్పకుండా కేవైసీ చేయించుకోవాలని సిబ్బంది సుమశ్రీ తెలిపారు. లేకుంటే ప్రభుత్వం అందించే సదుపాయాలు అందవన్నారు.

నేడు ప్రైవేటు వైద్య సేవలు బంద్

కదిరి అర్బన్, ఆగస్టు 16 : కొలకత్తాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారం, హత్యకు నిరసనగా ఐఎంఏ పిలుపు మేరకు కదిరి పట్టణంలో శనివారం ప్రైవేటు వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఐఎంఏ కదిరి శాఖ అధ్యక్షుడు డాక్టర్ మధన్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటలో తెలిపారు. విధుల్లో ఉన్న వైద్యురాలిపై అమానుషంగా సామూహిక హత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు పట్టణంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసర సేవలు మినహా... మిగిలిన సేవలు నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక

గాండ్లపెంట, ఆగస్టు 16: మండలంలో 2023-24లో చేపట్టి ఉపాధి పనులపై డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ప్రజావేదికను నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ... మండలంలోని 14 పంచాయతీలో సామాజిక బృందం పర్యటించి పనుల వివరాలు, కూలీల బిల్లులు చెల్లింపులు, పింఛన్లు, పంచాయతీ రాజ్‌లో చేపట్టిన పనులపై ఆరా తీశామన్నారు. పలు గ్రామాల్లో పనుల్లో కొలతల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు.. మస్టర్లలో కూలీల సంతకాలు లేనట్లు.. మరికొన్ని చోట్ల గ్రామాల్లో లేనివారి పేర్లలో పనులు చేయించినట్లు గుర్తించామన్నారు. అలాగే ఆశకార్యకర్తలు పనులకు వెళ్లారని, ఉపాధిలో అవకతవకలను గుర్తించామని అన్నారు. రూ.8.60 కోట్లతో చేపట్టిన ఉపాధి పనుల్లో రూ.84 వేలు అక్రమాలు చోటు చేసుకున్నట్లు వెల్లడించారు. ఆ సొమ్మును రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా, గ్రామసభకు ఉపాధి కూలీలు, ప్రజాపత్రినిధులు రాకపోవడంతో ఖాళీ కూర్చీలు దర్శనమించారు.

కార్యక్రమంలో జిల్లా మానిటింగ్ అధికారి సుధాకర్‌రెడ్డి, సహాయ విజిలెన్స్ అధికారి రామ్‌కుమార్, ఎస్‌ఆర్‌ఓ సుబ్బారెడ్డి, ఏపీడీ రమేష్‌బాబు, ఎంపీడీఓ రామనాయక్, ఏపీఎం సూర్యనారాయణ, పంచాయతీరాజ్ జెఈ రెడ్డివరప్రసాద్, ఈసీ సుబ్బారెడ్డి, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు, వివిధశాఖలాధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న అధికారులు


కూలీలు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఉద్యోగుల గుర్తింపు దినోత్సవం

పుట్టపర్తి, ఆగస్టు 16: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుర్తింపు దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉద్యోగ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జెండా ఆవిష్క రణ చేసి.. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై సంఘం ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుందన్నారు. ప్రతి ఉద్యోగి సంఘంలో సభ్యులుగా చేరాలన్నారు. అనంతరం కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి

అలరించిన సంగీత కచేరి

పుట్టపర్తి, ఆగస్టు 16: ఎన్టీఆర్ జిల్లా భక్తులు సంగీత కచేరితో భక్తులను అలరింపజేశారు. పర్తి యాత్ర పేరుతో శుక్రవారం ప్రశాంత నిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంత్ మందిరంలో సంగీత గాన కచేరి నిర్వహించారు. గంటపాటు కామాక్షి అంబటిపూడి బృందం వయోలిన్ వాయిద్యంతో భక్తులను అలరింపజేశారు. అనంతరం భక్తిపాటల ఆలపించారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



సంగీత కచేరి నిర్వహిస్తు కామాక్షి అంబటి పూడి, భక్తి గీతాలు ఆలపిస్తున్న భక్తులు

మోసం చేశారని పాడి రైతుల ఫిర్యాదు

కదిరి అర్బన్, ఆగస్టు 16: కదిరి మండ లంలోని పట్నం అమూల్ డెయిరీ సొసైటీలో పనిచేస్తున్న పాల సేకరణ సెక్రటరీ తమను మోసం చేశారని ఆ గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత రైతులు మాట్లాడుతూ.. డెయిరీలో సెక్రటరీగా పనిచేస్తున్న అనీల్‌కుమార్ పాల బిల్లుల చెల్లింపులో తమను మోసం చేశారన్నారు. పశువుల దాణా ఇవ్వకపోయినా... ప్రతినెలా తాము దాణా తీసుకున్నట్లు బిల్లులో కోత విధించినట్లు వాపోయారు. తమకు తెలియకుండా నగదు రూపంలో రూ.వేలల్లో మోసం చేశారని మండిపడ్డారు. పాడి పశువులు బ్యాంక్‌లో రుణాలు ఇప్పిస్తామని ఆధార్‌కార్డులు తీసుకుని బ్యాంక్‌లో ఖాతా తెరచి, తమకు తెలియకుండానే రుణాలు తీసుకున్నట్లు ఆరోపించారు. తమ ఫిర్యాదు మేరకు సీఐ మోహన్ కేసు నమోదు చేశారని బాధిత రైతులు శ్రీనివాసులు, రమేష్, అశోకకుమార్, చంద్ర, సురేష్, క్రిష్టప్ప, ముత్యాలు, నారాయణస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, గోపీ, భాస్కర్ తెలిపారు.


సీఐకి ఫిర్యాదు చేస్తున్న పాడి రైతులు

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

కదిరి, ఆగస్టు 16 : హత్యాయత్నం కేసులో ఓ నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 13న కదిరి టౌన్ నానా దర్గా సమీపంలో నగదు విషయమై షేక్ షబ్బీర్‌పై కదిరి నిజాంవలీ కాలనీకి చెందిన షేక్ రఫీ హత్యాయత్నం చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పరారీలో ఉన్న షేక్ రఫీ కోసం గాలించారు. గురువారం రాయచోటి రోడ్డులోని రైల్వే బిడ్జి వద్ద అతను ఉండగా అరెస్టు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. అతని వద్ద హత్యాయత్నానికి ఉపయోగించిన ఒక చెక్క మొద్దును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అడిషనల్ జుడీషియల్ ఫస్టుక్లాస్ మెజిస్టేట్ ముందు హాజరుపరగా, నిందితుడికి 15 రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు.

బాధితులకు ఆర్డీటీ చేయూత

కదిరి అర్బన్, ఆగస్టు 16 : ఇటీవల కురిసిన వర్షానికి మండలంలోని మల్లయ్యగారిపల్లితండాలో ఇళ్లలోకి నీరుచేయడంతోపాటు 17 గొర్రెలు మృత్యువాత పడిన విషయం విదితమే. అందుకు స్పందించిన ఆర్డీటీ ఆధ్వర్యంలో 22 కుటుంబాలకు పది కేజీలు బియ్యం, కందిబేడలు, నూనె తదితర నిత్యవసర వస్తువులు శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, ఏరియా టీమ్ లీడర్ లక్ష్మణ, సీఓ శ్రీదేవి, ఎస్‌టీఎల్ రామ్‌ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.


నిత్యావసర వస్తువులు అందచేస్తున్న ఆర్డీటీ సిబ్బంది

వరాల తల్లీ.. వందనాలమ్మా..!

● భక్తిశ్రద్ధలతో వరమహాలక్ష్మీ వ్రతం




అగళిలో..

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: వరమహాలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణమాసం రెండవ శుక్రవారం వరలక్ష్మి నోమను ఆచరించుకోవడం ఆనవాయితీ. ఈ సంర్భంగా లోగిళ్లను శోభాయామానంగా తీర్చిదిద్దారు. మహిళలు రకరకాల పూలతో అమ్మవారిని అందంగా అమ్మవారి పాటలు పాడుతూ, నోములు నోచి వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లోని పలు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలతో అర్చనలు, పూజలు నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో సామూహికంగా వ్రతాన్ని నిర్వహించుకున్నారు. అమ్మవారికి పూలు, కొబ్బరికాయలు, చందనం, పసుపు, కుంకుమను అక్షింతలు సమర్పించారు.


సత్యనారాయణపేటలో

హిందూపురంలో ముస్తాబైన వాసవీమాత


మడకశిరలో..


మహాలక్ష్మి అమ్మవారు


కొల్లాపురమ్మ ఆలయంలో..


యల్లమ్మ ఆలయంలో..


గోరంట్లలో..


కొల్లాపురమ్మ


కాళికాంబ


గుమ్మయ్యగారిపల్లిలో మారెమ్మ


బాలయ్యకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

నూతన భవనం నిర్మించండి

● ఎమ్మెల్యే బాలకృష్ణకు పట్టు రైతుల వినతి

హిందూపురం అర్బన్, ఆగస్టు 16: పట్టణంలో ఉన్న పట్టుగూళ్ల మార్కెట్ భవనం పాడుబడి రైతులకు ఇబ్బందిగా మారిందని నూతన భవనం నిర్మించాలని పట్టురైతులు ఎమ్మెల్యే బాలకృష్ణను కోరారు. శుక్రవారం పట్టు రైతులు ఎమ్మెల్యే బాలకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ హిందూపురం పట్టు మార్కెట్ చాల పెద్దదని, ఇక్కడకు ఇతర జిల్లాల నుంచి కూడా రైతులు పెద్ద సంఖ్యలో వస్తుంటారన్నారు. ఎన్టీఆర్ హయాంలో సిల్కు, మిల్కు నినాదంతో ఇక్కడ మార్కెట్ ఏర్పాటు చేసి లక్షలాది మంది రైతులకు ఉపాధి కల్పించారన్నారు. అయితే ఇటీవల కాలంలో వర్షం కురిసిన ప్రతిసారి మార్కెట్‌లోక నీరు చేరి ఇబ్బంది పడుతున్నామన్నారు. పట్టు రైతులకు రూ.60 కోట్ల ఇన్సెంటీవ్ పెండింగ్‌లో ఉందని వాటిని అందేలా చేయాలని కోరారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న 265 చెరువులను నింపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ధనాపురం వెంకటరామిరెడ్డి, పట్టురైతు సంఘం నాయకులు సిద్దారెడ్డి, జయరామిరెడ్డి, రీలర్ ముస్తపా ఉన్నారు.

అలరించిన సంగీత కచేరి


పాటలు పాడుతున్న భక్తులు


సంగీత కచేరి నిర్వహిస్తున్న కామాక్షి అంబటిపూడి

పుట్టపర్తి, ఆగస్టు 16: ఎన్టీఆర్ జిల్లా భక్తులు సంగీత కచేరితో భక్తులను అలరింపజేశారు. పర్తియాత్ర పేరుతో శుక్రవారం ప్రశాంత నిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంత్ మందిరంలో గాన కచేరి నిర్వహించారు. గంటపాటు కామాక్షి అంబటి పూడి బృందం వయోలిన్ వాయిద్యంతో భక్తులను మైమరపింపజేశారు. అనంతరం భక్తిపాటలు ఆలపించారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు

సీఐ బాధ్యతల స్వీకరణ


సీఐ అబ్దుల్ కరీమ్

హిందూపురం, ఆగస్టు 16: హిందూపురం రెండో పట్టణ సీఐగా అబ్దుల్ కరీమ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల విషయంలో రాజీపడేది లేదని, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కడప జిల్లా వీఆర్ నుంచి హిందూపురం టూటౌన్‌కు ఆయన బదిలీపై వచ్చారు. గతంలో వన్‌టౌన్, టూటౌన్‌ల్లో ఆయన ఎస్‌ఐగా పనిచేశారు.

నిబద్ధతతో పనిచేస్తే ఉత్తమ ఫలితాలు : ఎంపీడీఓ

గోరంట్ల, ఆగస్టు 16: ఉద్యోగులు నిబద్ధతతో సమష్టిగా పని చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. బదిలీ అయిన ఆయనకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. నూతన ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు ప్రవీణ్ కుమార్ సేవలను కొనియాడారు. ఎన్నికలను సమర్థంగా నిర్వహించడంపై ప్రశంసించారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఉపాధి అధికారులు, విద్యాశాఖ, వ్యవసాయ, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆయన్ని సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల, ఎంఈఓ గోపాల్, ఏఓ మునిక్రిష్ణ, ఏపీఓ వరప్రసాద్, కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖలాధికారులున్నారు.

జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యం

● నిస్వార్థంగా రాజకీయాలు ● అన్నివర్గాలకు న్యాయమే ధ్యేయం ● జిల్లాకు విరివిగా పరిశ్రమలు : ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం/అర్బన్/లేపాక్షి, ఆగస్టు 16: జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అన్న క్యాంటీన్లను ప్రారంభించిన అనంతరం బాలాజీ థియేటర్ రోడ్డులో జిమ్ కేంద్రాన్ని ప్రారంభించారు. లేపాక్షి మండలం మానెంపల్లిలో కమ్యూనిటి హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. సాయంత్రం పట్టణంలోని పశువైద్య శాల ఆవరణంలో మందుల నిల్వల కోసం గోదాము నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్కడ నుంచి ఆర్టీసీ బస్టాండుకి వెళ్లి మంత్రి సవితతో కలిసి కొత్త బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ స్వయంగా బస్సుని నడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నివాసంలో జిల్లా కలెక్టర్ చేతన్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన హిందూపురానికి సాగు, తాగునీరు ఇచ్చామని, ప్రస్తుతం పేదలకు అన్న క్యాంటీన్ ద్వారా భోజనం పెట్టడం ప్రారంభించామన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో కూడా రెండున్నరేళ్ల కాలం అన్న క్యాంటీన్‌ను కొనసాగించామన్నారు. అత్యధిక నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. చిలమత్తూరు మండలంలో పారిశ్రామిక అభివృద్ధి చేపడ్తామన్నారు. ఇప్పటి దాకా ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ. 90 కోట్ల నిధులు మంజూరయ్యాయయన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నో కార్యక్రమాలకు స్వీకారం చుట్టారన్నారు. ఎన్టీఆర్ ప్రాతినిథ్యం వహించిన హిందూపురం నుంచి ఎమ్మెల్యేగా మూడోసారి గెలవడం పూర్వజన్మ సుకృతం అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆర్టీసీని నిర్వీర్యం చేశారని, దీని వలన డొక్కు బస్సులతోనే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారన్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే చెప్పిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చేతన్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, పలు శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


బస్సు ప్రారంభోత్సవంలో మంత్రి సవిత, ఎమ్మెల్యే బాలకృష్ణ


బస్సు నడుపుతూ..

ఉపాధ్యాయ భవనానికి స్థలం కేటాయించండి

ఉపాధ్యాయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు విన్నవించారు. చాలా కాలంగా ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించేందుకు స్థలం లేదని వారు వివరించారు.

రాజీ పడకండి.. సహకరిస్తా

శాంతిభద్రతల విషయంలో రాజీపడవద్దని ఎమ్మెల్యే బాలకృష్ణ సూచించారు. ఎమ్మెల్యే నివాసంలో జిల్లా ఎస్పీ రత్న, డీఎస్పీ కంజక్షన్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన వైసీపీ పాలనలో గంజాయి అమ్మకాలు, మట్కా, పేకాట జోరుగా సాగాయని వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఇటీవల పురంలో జరిగిన హత్యలో విచారణ చేపట్టాలని, వాటి వెనక ఎవరున్నా వదలవద్దని సూచించారు. పోలీస్ అధికారులకు ఎల్లప్పుడూ సహకరిస్తానన్నారు.

పారిశ్రామిక అభివృద్ధే లక్ష్యం

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

మడకశిరటౌన్, ఆగస్టు 16 : నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన వారు పట్టణ సమీపంలోని చీపులేటి వద్ద నిర్మించిన ఇండియన్ డిజైన్ గార్మెంట్ పరిశ్రమను సెప్టెంబరు 2న ప్రారంభిస్తామన్నారు. ఈనెల 17, 18 తేదీల్లో గార్మెంట్ పరిశ్రమ నందు పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. టైలర్లు, ఆపరేటర్లు, కేటీ ఆపరేటర్లు, హెల్పర్స్, కట్టర్స్, శాంప్లింగ్ టైలర్స్, సూపర్‌వైజర్‌లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు, ప్యాకర్స్ ఇలా అన్ని రకాల ఉద్యోగాలుంటాయన్నారు. నియోజకవర్గంలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్.అనంతపురం వద్ద 1600 ఎకరాల్లో పారిశ్రాక వాడ ఏర్పాటు చేసేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితోనే కియా పరిశ్రమ ఏర్పడిందని, అందులో వేలాది మంది ఉపాధి పొందుతున్నారన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● అధికారులకు మంత్రి సవిత హెచ్చరిక


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఆగస్టు 16: ఉద్యోగులు విధులపట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పెనుకొండ మండల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగులు సమస్యలుంటే తెలపాలని, సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. గ్రామాల అభివృద్దే చంద్రబాబు లక్ష్యమన్నారు. గ్రామల్లో సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్, నీటి సరఫరా సమస్యలపై తక్షణమే స్పందించాలన్నారు. సమావేశంలో విద్యుత్, ఉపాధి, ఆర్ అండ్‌బీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలి: కలెక్టర్

హిందూపురం అర్బన్, ఆగస్టు 16: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని సత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈఐసీ బిల్డింగ్, ఆక్సిజన్ ప్లాంట్, స్టాఫ్ క్వాటర్స్, జనరేటర్‌రూం, డయాలసిస్ ప్లాంట్, వాటర్ ప్లానెట్ తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, మందులు, సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. రోగులకు కంప్యూటర్ ఓపీ స్లిప్‌లు అందించాలన్నారు. కలెక్టర్ పరిశీలన సమయంలో సూపరింటెండెంట్ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహించినట్లు సమాచారం. సూపరింటెండెంట్ స్థానికంగా ఉండాలని ఆదేశించినట్లు సమాచారం. ఆయన వెంట పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్ఎంఓ డేవిడ్‌రాజ్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఓబులమ్మ తదితరులు ఉన్నారు.


రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

యువకుడి ఆత్మహత్య


రంజిత్‌రెడ్డి (ఫైల్)

హిందూపురం(పరిగి), ఆగస్టు 16 : మండల పరిధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో దాసన్నగారి రంజిత్‌రెడ్డి(24) శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి కృష్ణవేణి తెలిపిన వివరాల మేరకు.. రంజిత్‌రెడ్డి కియ పరిశ్రమలో పనిచేస్తుండేవాడు. తరచూ మద్యం సేవిస్తుండటంతో కడుపునొప్పితో ఇబ్బందిపడేవాడు. కడుపునొప్పి తీవ్రం కావడంతో తట్టుకోలేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ జయలలిత ఘటనాస్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు


బోల్తా పడిన టెంకాయల లారీ

పెనుకొండ రూరల్, ఆగస్టు 16: టెంకాయల లారీ బోల్తా పడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటకలోని మద్దూరు నుంచి టెంకాయల లోడువేసుకుని డ్రైవర్ ఇర్ఫాన్ నాగపూర్‌కు బయలుదేరాడు. పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్ వద్దకు రాగానే వేగంగా వస్తున్న లారీ అదుపుతప్పి డివైడర్లను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఇర్ఫాన్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై కృతజ్ఞత యాత్ర

హిందూపురం అర్బన్, ఆగస్టు 16: తెలుగుదేశం పార్టీ సీఎం చంద్రబాబు ఇచ్చన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణకు సహకరించినందుకు ఆయనకు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు.. చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఏపీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామంజినప్ప, కార్యదర్శి మద్దిలేటి ఆధ్వర్యంలో హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు కృతజ్ఞతా యత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు ఉద్యోగాల్లో న్యాయం జరుగుతుందన్నారు. మాజీ సీఎం జగన్ హయాంలో మాదిగల అభివృద్ధి కుంటిపడిందన్నారు. కార్యక్రంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది మంద ఓబుళేశు, రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, బహుజన చైతన్య వేదిక అధక్షుడు శివరామ్‌కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిశెట్టి, రాచేపల్లి రామాంజి, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పెనుకొండ రూరల్, ఆగస్టు 16: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జాబ్ కోఆర్డినేటర్ లక్ష్మి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అనంతపురంలోని పంగల్ రోడ్డులోని టీటీడీసీలో ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన నిరుద్యోగ యువతీయువకులకు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణాకాలంలో ఉచిత భోజనం, సదుపాయాలు కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తయ్యాక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కోర్సుల్లో ప్రాజెక్ట్ మేనేజర్ 5జీ నెట్‌వర్కింగ్ శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించే సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. 18ఏళ్ల నుంచి 26 సంవత్సరాల యువతీయువకులు అర్హులన్నారు. వివరాలకు 7989479371 నంబరులో సంప్రదించాలన్నారు.

సబ్సిడీపై విత్తన రాగులు మంజూరు

గోరంట్ల, ఆగస్టు 16: మండలంలోని రైతుల సౌకర్యార్థం వేగవంతి రకానికి చెందిన పది టన్నుల విత్తన రాగులు మంజూరైనట్లు ఏఓ మునికృష్ణ తెలిపారు. నాలుగు కిలోల రాగుల బ్యాగును 40శాతం సబ్సిడీతో రూ.144 చెల్లించి రైతులు పొందవచ్చన్నారు. మండలంలోని ఆర్బీకేల ద్వారా కిలో రాగులు రూ.37వంతున విక్రయిస్తున్నట్లు చెప్పారు. నీటి ఆధారమున్నరైతులు పైరు పోసుకుని నాటితే ఎకరాకు రెండు కిలోలు అవసరమన్నారు. అయితే ఎకరాకు నాలుగుకిలోల రాగులు పొలంలోనేగా విత్తాల్సి ఉంటుందన్నారు. అవసరమున్నరైతులు ఆర్బీకేల ద్వారా పట్టాదారు పాస్‌పుస్తరం, ఆధార్, సెల్‌నెంబ ఓటీపీ ద్వారా రాగులు పొందవచ్చన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం

గోరంట్ల, ఆగస్టు 16: మండలంలోని గుమ్మయ్యగారిపల్లి శ్రీమారెమ్మ ఆలయ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య చికిత్స శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతపురం కిమ్స్ సవేరా ఆసుపత్రి డాక్టర్ రామ్‌కుమార్ శిబిరంలో చికిత్సలు అందించారు. గుండె వ్యాధులున్నవారి నిపరీక్షించి ఈసీజీ ద్వారా 55మందికి చికిత్సలు చేశారు.వారిలోన లుగురికి శస్త్రచికిత్సలు అవసమని వైద్యులు నిర్ధారించినట్లు అర్చకులు దేవిస్వామి తెలిపారు. శిబిరంలో ఆసుపత్రి ఎగ్జిక్యూటీవ ఆనంద్‌బాబు, సిబ్బంది ఏకాంత్, గీత తదితరులు, రోగులు, ఆలయ సేవాసమితి సభ్యులున్నారు.

పగటిపూట బ్లాస్టింగ్‌పై స్థానికుల ఆగ్రహం

లేపాక్షి, ఆగస్టు 16: పగటిపూట కొండల్లో బ్లాస్టింగ్‌పై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బయన్నపల్లి సమీపంలోని గుట్టలో ఏర్పాటు చేసిన కంకర మిషన్ క్వారీ వద్ద ఇటీవల బ్లాస్టింగ్‌లు అధికంగా జరుగుతున్నాయనీ, వాటిని నిలిపివేయాలని బయన్నపల్లి, మామిడిమాకుల పల్లి, బసవనపల్లి వాసులు డిమాండ్ చేస్తున్నారు. రాత్రి సమయాల్లో బ్లాస్టింగ్ జరపకుండా పగలే చేయడంతో అడవిలోకి వెళ్లిన పశువులు ప్రమాదాల బారిన పడుతున్నాయని వారు వాపోతున్నారు. పశువులను మేతకోసం తీసుకెళ్లాలంటే ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంకర కోసం కెమికల్స్‌ను అధికంగా వాడుతున్నారని, దాని వాసనవల్ల పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయన్నారు. ఇటీవల బ్లాస్టింగ్‌కు ఉపయోగించిన కెమికల్స్ వాసనతో చుట్టుపక్కల పిల్లలు అస్వస్థతకు లోనవుతున్నారన్నారు. మూడు గ్రామాల ప్రజలు గతంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ప్రజల ప్రాణాలకన్నా అధికారులకు మామూళ్లే ముఖ్యమని ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. పేలుళ్ల శబ్దానికి ఇళ్ల గోడలు నెర్రలు చీలి ఎప్పుడు కూలుతాయోనని భయబ్రాంతుల్లో జీవిస్తున్నామన్నారు. సంబంధిత అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. కంకర క్వారీ యజమానులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


పగలే బ్లాస్టింగ్ చేస్తున్న దృశ్యం

భారీ వాహనాలతో దెబ్బతింటున్న రోడ్లు

● గుంతల దారుల్లో ప్రయాణం నరకం

మడకశిర, ఆగస్టు16: భారీవాహనాల రాకపోకలు అధికంగా ఉండడంతో ప్రదాన రహదారులు , గ్రామీణ రోడ్లు దెబ్బతింటున్నాయి. ఆర్ అండ్ బీ నుంచి జాతీయ రహదారి పరిధిలోకి మారి నాలుగు సంవత్సరాలు పైబడుతున్నా ఆ రహదారి రూపు రేఖలు మాత్రం మారడం లేదని, ఆ రహదారి లో వెళ్లాంటే నరక యాతన పడాల్సి వస్తోందని వాహనదారుల అంటున్నారు. అనంతపురం నుంచి బెంగళూరు వెళ్ళడానికి మూడు సంవత్సరాల క్రితం పెనుకొండ మీదుగా హిందూపురం వెళ్లేవి. ప్రస్తుతం కొడికొండ చెక్‌పోస్టు నుంచి మడకశిర మీదుగా వయా రొళ్ల అగలి వరకు హైవే రోడ్డు పూర్తి అయింది. దీంతో వాహనాలు పెనుకొండ నుంచి హిందూపురం నుంచి వాహనాలు మడకశిర మీదుగా శిరా, హిరియూరు, తుముకురు కు వెళ్తున్నాయి. భారీ వాహనాలు ఆ రోడ్డుపై వెళ్తుండంతో మడకశిర పట్టణంలోని మధుగిరి సర్కిల్ నుంచి మేర రోడ్డు దెబ్బతిని గుంతలమయం అవుతోంది. ఆ రోడ్డు గుండా ప్రయాణించాలంటే వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు అయినా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. మడకశిర పట్టణ సమీపం లో రైల్వే లైన్ పనులు, జరుగుతుండడంతో భారీవాహనాలు నిత్యం తిరుగుతున్నాయి. దీంతో రహదారి మరింత దెబ్బ తింటోంది. దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన కొద్దిరోజులకే అవి దెబ్బతిని గుంతల మయ్యం అవుతున్నాయి. గత రెండు సంవత్సరాలుగా దెబ్బతిన్న రోడ్లను కొత్తగా రోడ్డునిర్మాణాలు చేపట్టాలని కోరుతున్న నేటికి నిర్మాణాలకు నోచుకోవడంలేదు. దెబ్బ తిన్న రోడ్లతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు తరుచూ ప్రమదాలకు గురి అవుతున్నారు. గత సంవత్సర వర్షాలకు గుంతలమయం అయిన రోడ్డు ను వేలాది రూపాయాలు ఖర్చు చేసి తాత్కాలిక మర్మత్తులు చేపట్టిన అవి మరలా దెబ్బతింటున్నాయి. ఇప్పటి కైన అధికారులు స్పందించి వాటి మర్మత్తులు చేపట్టకపోతే ఆరోడ్డులు మరింత దెబ్బతింటాయని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. భారీ వాహనాలు రాకపోకలకు అనుకూలంగా ఉండేవిధంగా మంజూరు అయిన నిధులతో కొత్తగా రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. హిందూపురం నుంచి తుముకూరు కు వెళ్ళే రోడ్డుకు 5 కిలో మీటర్ల మేర (వద్రపాళ్ళ నుంచి మడకశిర మీదుగా వెటర్నరీ పాలిఎక్‌నిక్ కళాశాళ వరకు) రూ.15 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని టెండర్లు కూడా అయినాయని త్వరలో పనులు ప్రారంభం అవుతాయని సంబందిత శాఖఅధికారుల సమాచారం.


గుంతలమయమైన రహదారి